# హిబా (స్వయం సమర్పణ) ప్రకరణం

## 1వ అధ్యాయం - ఒకరికి దానం చేసిన వస్తువుని తిరిగి అతని నుండి కొనరాదు

1045. హజ్రత్ ఉమర్ (రజి) కథనం:- నేనొక గుర్రాన్ని దైవమార్గంలో స్వారీ కోసం ఒకతనికి ఇచ్చి వేశాను. అయితే అతనా గుర్రాన్ని దుర్భరస్థితికి చేర్చాడు. అందువల్ల నేను ఆ గుర్రాన్ని తిరిగి అతని నుండి కొని తీసుకుందామని భావించాను. పైగా అతనా గుర్రాన్ని తక్కువ ధరకు అమ్ముతాడని కూడా నేను భావించాను. ముందుగా దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం)ను తెలుసుకుందామని అడిగాను. కాని ఆయన (దాన్ని వ్యతిరేకిస్తూ) "అతనా గుర్రాన్ని ఒక దిర్హంకు అమ్మదలచినా సరే నీవు దాన్ని కొనకు. దానం చేసిన దాన్ని తిరిగి తీసుకోకూడదు. దానం చేసిన దాన్ని తిరిగి తీసుకోవడం అంటే కక్కినదాన్ని నాకటమే అవుతుంది" అని అన్నారు.

[సహీహ్ బుఖారీ : 34వ ప్రకరణం - జకాత్; 59వ అధ్యాయం - హల్ యష్తరీ సదఖతహూ]

1046. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం:- హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) దైవమార్గంలో ఒక గుర్రాన్ని స్వారీ కోసం ఒక యోధునికి దానం చేశారు. ఆ తర్వాత ఆ గుర్రాన్ని (ఆ వ్యక్తి) అమ్ముతుంటే హజ్రత్ ఉమర్ (రజి) దాన్ని కావాలనుకొని దైవప్రవక్త (సల్లం)ను విచారించారు. అప్పుడు దైవప్రవక్త(సల్లం) "దాన్ని కొనకు. దానం చేసిన దాన్ని తిరిగి తీసుకోకు" అని అన్నారు.

[సహీహ్ బుఖారీ : 56వ ప్రకరణం - జిహాద్, 119వ అధ్యాయం - అల్‌జఆయిల్ వల్ హమలాన్ ఫిస్సబీల్]

## 2వ అధ్యాయం - దానం, కానుకలు ఇచ్చి తిరిగి తీసుకోవడం నిషిద్ధం. అయితే తండ్రి గాని, తాతగాని సంతానానికి తామిచ్చిన దాన్ని తిరిగి తీసుకుంటే తప్పు లేదు

1047. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:- "ఎవరికైనా దానంగా గాని, కానుకగా గాని ఏదైనా ఇచ్చి, తిరిగి తీసుకునేవాడు కక్కిదాన్ని నాక్కునే కుక్కలాంటివాడు."

[సహీహ్ బుఖారీ : 51వ ప్రకరణం - అల్‌హిబా, 14వ అధ్యాయం - హిబతిర్రజులిల్ ఇమ్రాతి హీవల్ మరాతిల్ జౌజహా]

## 3వ అధ్యాయం - సంతానానికి హిబా చేస్తున్నప్పుడు వివక్ష చూపకూడదు

1048. హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) కథనం:- మా నాన్నగారు నన్ను వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికెళ్ళి "దైవప్రవక్తా! నేను నా కొడుక్కు ఒక బానిసను హిబా (అంకితం) చేశాను" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) అది విని "మరి నీవు నీ కొడుకులందరికీ ఇలాగే హిబా చేశావా?" అని అడిగారు. దానికి నేను లేదన్నాను. "అయితే అతని నుండి కూడా వాపసు తీసుకో" అన్నారు దైవప్రవక్త (సల్లం).

[సహీహ్ బుఖారీ : 51వ ప్రకరణం - హిబా, 12వ అధ్యాయం - అల్‌హిబతిల్ వలద్]

1049. హజ్రత్ ఆమిర్ (రహ్మలై) కథనం:- హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) వేదిక ఎక్కి ఇలా అనడం నేను విన్నాను - "మా నాన్నగారు నాకొక కానుక ఇచ్చారు. అయితే (నా తల్లి) హజ్రత్ ఉమ్రా బిన్తె రవాహ (రజి) దీనిపై తన అభిప్రాయం వెలిబుచ్చుతూ "మీరీ కానుక ఇవ్వడంపై దైవప్రవక్త (సల్లం) ను సాక్షిగా నిలబెట్టనంతవరకు నేను సంతోషించలేను" అని అన్నారు. అందువల్ల మా నాన్నగారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి "దైవప్రవక్తా! నేను ఉమ్రా బిన్తె రవాహా (రజి) కడుపున బుట్టిన నా కొడుక్కు ఒక కానుక ఇస్తే దానికి మిమ్మల్ని సాక్షిగా నిలబెట్టాలని అన్నది ఆమె" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "మరి నీవు నీ కొడుకులందరికీ ఇలాగే కానుకలిచ్చావా?" అని అడిగారు. దానికి మా నాన్న లేదన్నారు. అప్పుడు దైవప్రవక్త "దేవునికి భయపడి, నీ కొడుకుల మధ్య న్యాయాన్ని పాటించు' ' అని బోధించారు. దాంతో మా నాన్నగారు (ఇంటికి) తిరిగొచ్చి తానిచ్చిన కానుకను నా దగ్గర్నుండి వాపసు తీసుకున్నారు''.

[సహీహ్ బుఖారీ:51వ ప్రకరణం - హిబా, 13వ అధ్యాయం - లా షహాద ఫిల్ హిబా ]

## 4వ అధ్యాయం - శాశ్వతంగా హిబా (అంకితం) చేయడం

1050. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) ఉమ్రా[1] (శాశ్వత కానుక) విషయంలో మాట్లాడుతూ "ఒకరికి ఇవ్వబడిన వస్తువు ఇక (శాశ్వతంగా) అతనిదే అవుతుంది" అని అన్నారు.

[సహీహ్ బుఖారీ : 51వ ప్రకరణం - హిబా, 32వ అధ్యాయం - మాఖీల ఫిల్ ఉమ్రా వర్రిఖ్బా]

1051. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:- "ఉమ్రా (కానుకను శాశ్వతంగా ఇచ్చివేయడం) ధర్మసమ్మతమే"[2]

[సహీహ్ బుఖారీ : 51వ ప్రకరణం - హిబా, 32వ అధ్యాయం - మాఖీల ఫిల్ ఉమ్రా వర్రిఖ్బా]

---

(1) ఎవరికైనా ఏదైనా కానుక లేదా పారితోషికం ఇచ్చేటప్పుడు నీవు బ్రతికున్నంత కాలం దీన్ని నీవు వాడుకోవచ్చు, అనుభవించవచ్చు అని చెప్పి ఇచ్చే వస్తువును 'ఉమ్రా' అంటారు. ఈ పారితోషికం విషయంలో ధర్మవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఆ పారితోషికం దాన్ని స్వీకరించిన వాడిదే శాశ్వతమైన సొత్తు అవుతుందన్నదే సరయిన విషయం. నీ తదనంతరం నేను దాన్ని తిరిగి తీసుకుంటానని ఎవరైనా షరతు విధిస్తే అది దుర్మార్గంతో కూడిన, పనికి మాలిన షరతుగా పరిగణించబడుతుంది.

(2) అంటే శాశ్వతంగా ఇచ్చిన పారితోషికం లేదా కానుక అన్నమాట. అది ఎవరి కివ్వబడుతుందో ఇక అతనిదే అవుతుంది. అతను చనిపోయిన తరువాత ఆ కానుక అతని వారసులకు పోతుంది. దానిపై ఇచ్చిన వ్యక్తికి ఇక ఎలాంటి హక్కుండదు.